# దారిలో దొరికిన ప్రేమలేఖలు



– ???

*ఎవరు వ్రాశారో తెలియదు, ఎవరికి వ్రాశారో తెలియదు. దొరికిన ప్రేమలేఖల సంపుటినుంచి నెలకో ప్రేమలేఖ !!*



## -4-

***నా ఉత్సాహపు చిలిపి కెరటమా,***

ఎంత అద్భుతమైనదీరోజు! నీవు గలగలా నవ్వగా యీనాడు మొదటగా చూశాను.. ఆ నవ్వుతో ఉదయించిన అద్భుత మంద్ర మనోహర శబ్దతరంగాలను విన్నాను. ఆ నవ్వులో ఎంత చిలిపిదనమూ! ఎన్నేళ్ళో తపస్సు చేశాక భగవంతుడు వరమివ్వటానికి ప్రత్యక్షమైతే ఎంత ఆనందమూ నిశ్చేష్టలూ కప్పివేస్తాయో, అంతటి ఆనందాన్ని నిశ్చేష్టతనీ నీ నవ్వు విన్న క్షణాల్లో పొందగలిగాను. అంత సౌందర్యాన్ని నీలోనే ఎలా దాచుకోగలిగావు ప్రాణమా!

మహోన్నత హిమ పర్వతాల అంచులపై అలవోకగా పడి బంగారు రంగుతో ప్రతిఫలించే బాలసూర్యుని కిరణాల్లాగా నీవు నవ్వగానే ఆ నవ్వు కిరణాలు వెన్నెలలు కురిపించాయంటే అతిశయోక్తికాదని నేను అనగలను. ఎంత చిలిపిదనం. ఎంత సౌందర్యం? ఎంత ఉత్సాహం నీది. ఓ పక్కకి నీ చిన్ని తలకాయను వంచి అరమోడ్పులైన కళ్ళతో చూస్తూ నువ్వు పకాలున నవ్వినప్పటి దృశ్యం నా మనస్సు తెరమీద వందలవేలసార్లు ప్రతిబింబించింది. అయినా నాకు తృప్తి తీరలేదు నా జీవమా!

నిన్నటి నిర్లిప్తతా, జీవితంపైన కలిగిన అనాసక్తతా, యీనాడు మటుమాయమయ్యాయి. నీ నవ్వులో పొంగిన ఉత్సాహమూ, చిలిపిదనమూ, ఆత్మహత్యకి సిద్ధపడినవాడికైనా బ్రతుకు మీద ఆశలు కల్పిస్తాయంటే నమ్ము. సౌందర్యం లేని జీవితమూ జీవితమేనా? సౌందర్యాన్ని నింపుకోలేని మనస్సు ఉన్నా లేకపోయినా ప్రయోజనమేముంది? ఏదో బ్రతుకు వెళ్ళదీయటం. ఆ బ్రతుకు వెళ్ళదీయటానికి కొద్దో గొప్పో చదువు కోవడమూ, డిగ్రీలు తెచ్చుకోవడమూ, ఆ తరువాత ఉద్యోగపు వేట మొదలుపెట్టి, విసిగి, వేసారి చివరికెట్లా గొట్లా సాధించి, 'ఓహ్.. ఇహ జీవితంలో స్థిరపడ్డాను..' అనుకుంటూ మూర్ఖత్వంలోనూ, రోజువారీ దినచర్యలోనూ, కూరుకుపోవడం. ఇదేనా జీవితం అంటే? ఏదో పనిచేస్తే ఎంతో కొంత డబ్బు వస్తుంది. ఆ కాయితాల్ని లెక్కలు పెడుతూ, ఎలా సర్దుబాటు చేసుకోవాలా అన్న విషయంతో సతమతమైపోతూ పైపై మెరుగులు పెట్టుకుంటూ, 'ఇది చేశానూ, అది చేశానూ' అనుకుంటూ తనలో తనే పొంగిపోవడమూ! ఇదంతా కేవలం లాభనష్టాల చిఠా అనో లేక రోజువారీ యాంత్రిక జీవనమనో తెలిశాక ఎంత నిరుత్సాహమూ ఎంత దుఃఖమూ మనస్సుని అలుముకుంటాయో! ఎవరి చుట్టూ వారు గిరిగీసుకుని బ్రతికే సామాన్యజీవితంలో శాంతీ విశ్రాంతీ ఎక్కడివి? ప్రతిక్షణమూ భయమే! ప్రతిక్షణమూ అస్థిరతే. ఇలాంటి ఎడారి జీవితంలో నీ ఒక్క నవ్వు ఎంత అద్భుతమైన అందాన్నీ అర్థాన్నీ నింపగలదో నీకెలా తెలుస్తుంది తరంగమా! నీ మనస్సు అనే ఉత్సాహపు యౌవ్వనసాగరం నించి ఉవ్వెత్తున లేచిన నవ్వుల కెరటపు

చిలిపిదనాన్నీ, తియ్యదనాన్నీ ఏమని వర్ణించను? నిన్నటి నా జీవితం నిస్సారం. యీనాడది మహోత్సాహపూరితం. ఎంత మార్పు? ఎంత పని చేసినా నాకు అలసటే లేదుకదా, ఇంకా ఇంకా చెయ్యగలనన్న ఉత్సాహం ఉబికి వచ్చింది. యంత్రాల రణగొణధ్వనులు నిన్నటి వరకూ నా చెవుల్ని చెల్లులు పొడిచినంత బాధ కలిగించేవి. యీనాడవన్నీ నాకు ప్రియమైనవి అయ్యాయి. నిన్నటివరకూ ఆ యంత్రాల్ని చూస్తే 'ఇవే నన్ను బానిస చేసినవి' అని అనిపించి వాటిని లోలోపల ద్వేషించేవాడిని. యీనాటి పరిస్థితిలేరు. వాటినీ ప్రేమించగలుగుతున్నాను. నా ప్రాణమా! ఇదంతా కేవలం నీ చిలిపి నవ్వు కలిగించిన ఉత్సాహపు ప్రభావమే. నా చిన్నిదేవతా! నా కృతజ్ఞతలను నీకు ఎలా తెలియచెప్పటం? ఒక్క నవ్వుతో నా జీవితానికి అర్ధమూ ఆనందమూ చేకూర్చావు. ఇదంతా వ్రాయటం నీకు 'పొగడటానికి చేసే ప్రయత్నంలా' కనిపించవచ్చు. ఒక్కోసారి పొగడ్తను భరించటమూ కష్టమే. ఆనందం కలిగించే పొగడ్త ఒక్కోసారి సిగ్గిల్ల చెయ్యవచ్చు. కానీ నా ఆత్మేశ్వరీ! నా ఉద్దేశ్యం మాత్రం పొగడటానికి కాదని ఖచ్చితంగా చెప్పగలను. నీవో ఉత్సాహపు కెరటానివి. చిలిపి తరంగానివి. హాయిని కల్గించే అమాయకపు నవ్వులరాణివి. ఆ హాయిని అనుభవించిన నేను, నీకా విషయం తెలుపకుండా ఎలా ఉండగలను? నీ మధురమైన స్వరంలో ఓ చిన్న శబ్దంగా మిగిలి పోవాలనే ఆశతో ఇక జీవించనా!

నీ

-X-



*(వచ్చేనెల మరో ప్రేమలేఖ)*

Post your comments